

పొలంలోకి చేరిన వర్షపునీరు

# పంట పొలాలను కాపాడండి

- భారత్‌మాల రోడ్డు వంతెనతో పొలాల్లోకి చేరిన వర్షపునీరు
- నీటి మునిగిన 50 ఎకరాలు
- ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

వడ్డేపల్లి, సెప్టెంబర్ 4 : జాతీయ రహదారి భారత్‌మాల రోడ్డు పనుల్లో భాగంగా కొంకల గ్రామ సమీపంలో ముండ్లదిన్నెకు వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే బ్రిడ్జి కింద రెండు రంధ్రాలు మాత్రమే ఉండగా, బ్రిడ్జి పక్కన అడ్డుగోడ కూడా నిర్మించారు. దీంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు బ్రిడ్జి నుంచి ముందుకు వెళ్లే అవకాశం లేకపోవడంతో వరద నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. 2009లో వరదలు వచ్చి రాజోళి పరిసర గ్రామాలు మునిగిన సమయంలో కూడా ఇక్కడ పొలాలు మునగలేదని ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి దాదాపు 50 ఎకరాల్లో పత్తి తదితర పంటలు నీట మునిగాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే బ్రిడ్జి కింద కేవలం రెండు రంధ్రాలే ఏర్పాటు చేయడం వల్ల వర్షపునీరు ముందుకు పోవడం లేదని, దీనివల్లే పంటపొలాలను వరద నీరు ముంచెత్తుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జికి కనీసం ఆరు రంధ్రాలు ఏర్పాటు చేసి వర్షాలు వచ్చినప్పుడు నీరు ముందుకు పోయేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే వర్షం వచ్చిన ప్రతి సారి నీరు పంటపొలాల్లోకి చేరడమే కాకుండా పొలాలకు వెళ్లే దారులు కూడా మూసుకుపోయి దళితవాడ కూడా భవిష్యత్‌లో నీటమునిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

***కలెక్టరేట్‌కు తరలిన రైతులు..***

భారత్‌మాల రోడ్డు వంతెన పనులతో నీటి మునిగిన పంటలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని, అదే విధంగా బ్రిడ్జి నుంచి కిందకు వర్షపునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతు బుధవారం బాధిత రైతులు కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాధితులు నాగరాజు, వెంకట్రాముడు, మౌలాలి, హుస్సేన్, బతుకన్న, బీచుపల్లి తదితరులు అదనపు కలెక్టర్ శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు.





పోలోని వాగుపై ఏర్పాటుచేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయిన దృశ్యం, పొంగిపొర్లుతున్న జూలేకల్ వాగు

# దంచికొట్టిన వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- పలు గ్రామాల నిలిచిన రాకపోకలు

అయిజ, సెప్టెంబర్ 4 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అయిజ–ఎమ్మిగనూర్ రహదారిలోని పోలోని వాగు పొంగి ప్రవహించడంతో అంతర్రాష్ట్ర రహదారి డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గమైన ఉత్తనూర్ మీదుగా ఎమ్మిగనూర్‌కు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ఎగువన భారీవర్షం కురవడంతో బింగిదొడ్డి చెరువు అలుగు పారడంతో అయిజ పట్టణంలోని పెద్దవాగుపై ఉన్న కాజ్‌వేపై వరద ప్రవహిస్తోంది. అయిజలోని మడ్డి గుంతకాలనీ, గాజులపేట, భరత్‌నగర్, దుర్గానగర్ తదితర కాలనీలు జలమయమయ్యాయి. అధికారులు లోతట్టు కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.

***ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్***

వడ్డేపల్లి, సెప్టెంబర్ 4 : నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జూలేకల్ సమీపంలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో జూలేకల్, జక్కిరెడ్డిపల్లె, కుర్వపల్లె, తిమ్మాజిపల్లె, శనగపల్లె, బుడ్డారెడ్డిపల్లె గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## నిత్య కృషీవలుడు.. కిశోర్



విద్యార్థులతో కలిసిపోయే వ్యక్తిగా పేరు పొందిన పాలమూరు విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. డా.కిశోర్ తల్లిదండ్రులు అనంత్‌రావు, ప్రేమలత, భార్య డా.శ్రీదేవి. ఈయన ఎంఎస్సీ పీహెచ్‌డీ కాకతీయ యూనివర్సిటీలో పూర్తి చేశారు. పీయూలో 2009లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరిన అనంతరం అనేక రకాల బాధ్యతలు చేపట్టారు. ముఖ్య పర్యవేక్షకుడిగా, విభాగాధిపతిగా, కళాశాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ కోఆర్డినేటర్‌గా, పీయూ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు డైరెక్టర్‌గా, పీయూ పాలక మండలి సభ్యుడిగా, ఐక్యూఏసీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. అనేకమంది విద్యార్థులు పీహెచ్‌డీ సాధించేందుకు దోహదపడ్డారు. డిగ్రీ విద్యార్థుల ఉపయోగార్థం 5 తెలుగు అకాడమీ పుస్తకాలతోపాటు ఇంటర్నేషనల్ గ్రంథాల్లో 22 పుస్తకాలు ప్రచురించారు. అనేక రకాలైన అవార్డులు సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఔషధ మొక్కలు పెంచే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు అందుకొని ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ పరిశ్రమలకు సైంటిస్టుగా, సలహాదారుడుగా వ్యవహరిస్తున్నారు. ఈయన సేవలు గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేసింది.




*అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి.. అక్షర జ్ఞానాన్ని నింపేది గురువులు.. క్రమశిక్షణను అలవర్చి భవితకు బంగారు బాటవేసేది వారే.. వేతనం కోసం కాకుండా విద్యార్థుల జీవన గమనాన్ని నిర్దేశిస్తూ.. ఉత్తమ ఫలితాల సాధనకు అంకితభావంతో పనిచేస్తూ ఎందరికో ఆదర్శ ప్రాయులుగా నిలుస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ.. వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తున్న ఆణిముత్యాల్లాంటి ఉపాధ్యాయుల సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలువురు మా 'స్టార్లు' రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకోనున్నారు. వారు విద్యాభివృద్ధికి చేసిన సేవలపై కథనం..*

*- మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 4*

# మా స్టార్లు

**వినూత్న రీతిలో బోధనలు.. భవితకు బంగారు బాటలు**

- ఉమ్మడి జిల్లాలోని ఈ గురువులు.. ఆదర్శప్రాయులు
- వృత్తికే వన్నెతెస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు
- వారి సేవలకు వరించిన రాష్ట్ర పురస్కారం
- నేడు హైదరాబాద్‌లో సత్కారం



## కందనూలులో ఇద్దరు..

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 4 : నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఇద్దరు టీచర్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కల్వకుర్తి మండలం జీడిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న పి.రఘుమారావు, తెలకపల్లి మండలం చిన్నముద్దునూర్ ఎంపీయూపీఎస్‌లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న జె.రాజశేఖర్‌రావు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను డీఈవో గోవిందరాజులు అభినందించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి వారిని సన్మానించనున్నట్లు డీఈవో తెలిపారు.



రఘుమారావు



రాజశేఖర్‌రావు

## కవిత.. బోధనే వేరప్పా..




ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతోపాటు నాటి, నేటి పద్ధతులను మేళవింపజేస్తూ విద్యార్థుల ఆసక్తి అభిరుచికి అనుగుణంగా సులభ రీతిలో విద్యను అందిస్తూ ముందుకు సాగుతుంది దేవరకద్ర మండలంలోని పెద్దరాజమూరు యూపీఎస్ ఉపాధ్యాయురాలు డి.కవిత. ఆమె స్వగ్రామం హన్వాడ మండలంలోని దాయపల్లి. అమ్మానాన్న వెంకటరంగారెడ్డి, వసంత దంపతులు. ఉపాధ్యాయురాలు కవిత 2000లో ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టారు. మద్దూరు, మహబూబ్‌నగర్, దేవరకద్ర మండలాల్లో విధులు నిర్వర్తించారు. వినూత్న విధానంలో తనదైన శైలిలో ప్రత్యేకంగా పాఠశాల ఫ్లోరింగ్‌ను బోధన అభ్యాసన సామగ్రిగా వినియోగించుకోవడం (బిల్డింగ్ యాజ్ ఏ లెర్నింగ్ ఎయిడ్) 'బాలా' ద్వారా ప్రత్యేక గుర్తింపు వచ్చింది. వైకుంఠపాళి, ఎక్కాల చట్రం, నెంబర్స్, ఆల్ఫాబెట్ కాన్సెప్ట్ గేమ్‌ను ఫ్లోరింగ్‌పై తానే స్వయంగా చిత్రీకరించిన గేమ్స్ ద్వారా విద్యార్థులు ఉల్లాసంగా ఆడుతూ బోధన విషయాలను ఆసక్తితో నేర్చుకునేలా బోధనలో వినూత్న పద్ధతులు అవలంభిస్తూ ముందుకు సాగుతున్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన టీఎల్ఎంను తయారు చేసి విద్యార్థులు బోధనాభ్యాస ప్రక్రియలో ఆసక్తిగా పాల్గొనేటట్లు చేస్తున్నారు. కళావిద్య, నోబ్యాగ్ డే, యోగా, బాలసభ, ఎండీఎం, వార్షిక స్వాగతోత్సవాలు నిర్వహించడం, టీఎల్ఎం మేళాలు, ప్రత్యేక రోజులకు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు వివరించడం, ఆరోగ్య పరీక్షలు చేయించడం, క్షేత్ర ప్రదర్శనలు, విద్యార్థుల ఆసక్తి అభిరుచికి అనుగుణంగా వివిధ రకాలైన పోటీలు నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తుండడంతో ఆమెను రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది.

## నోకాస్ట్.. లోకాస్ట్.. నర్సింహులు



ఉపాధ్యాయ వృత్తిలో 26 సంవత్సరాలుగా ఉంటూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు కోళ్ల నర్సింహులు. ఈయన స్వగ్రామం నారాయణపేట జిల్లా మక్తల్. తల్లిదండ్రులు కోళ్లరాములు, కోళ్ల శంకరమ్మ అత్యంత నిరుపేద కుటుంబం. బట్టలు ఉతికి ఇస్త్రీ చేసి తన ముగ్గురు బిడ్డలను కష్టపడి చదివించారు. వారి కష్టానికి తగ్గట్టుగానే ఇంటికి పెద్దవాడైన కోళ్ల నర్సింహులు 1998 డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొట్టమొదట గట్టు మండలంలోని సిద్దోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన ప్రాంతం గట్టు. అప్పట్లో 'చదువుకుందాం రా' అనే కార్యక్రమంలో విస్తృతంగా విశేష సేవలు అందించారు. అనంతరం ధరూర్, నవాబ్‌పేట మండలాల్లో పనిచేసి ప్రస్తుతం కోయిలకొండ మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్నారు. గతేడాది టీఎల్ఎం (బోధన అభ్యసన సామగ్రి)లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. విద్యార్థులతో మమేకమై సులభతరంగా గుణాత్మకంగా ఉత్తమ బోధన అందిస్తారనే పేరు ఉంది. నోకాస్ట్.. లోకాస్ట్.. పేరుతో టీఎల్ఎం ద్వారా తక్కువ ఖర్చుతో వివిధ రకాలైన బొమ్మలు తయారు చేసి విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో బోధనకు గానూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది.

## ఉపాధ్యాయ ఆణిముత్యం సునీత



నారాయణపేటరూరల్, సెప్టెంబర్ 4 : మండలంలోని కోటకొండ జీహెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న సునీత రాష్ట్రస్థాయి ఉత్తమ జీహెచ్ఎం అవార్డుకు ఎంపికైంది. ఈమె స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో నివాసముంటున్నారు. 12 సంవత్సరాలు ఎస్జీటీగా మహబూబ్‌నగర్ బేసిక్ ప్రాక్టిసింగ్ బాలికల ఉన్నత పాఠశాలలో 20 ఏండ్లపాటు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల జరిగిన పదోన్నతుల్లో జీహెచ్ఎంగా కోటకొండ జెడ్పీహెచ్ఎస్‌కు వచ్చింది. నేడు రవీంద్రభారతిలో ఆమె రాష్ట్రస్థాయి అవార్డును అందుకోనున్నారు.

## శభాష్.. శంకర్‌గౌడ్



వనపర్తి టౌన్/పెబ్బేరు, సెప్టెంబర్ 4 : పెబ్బేరు మండలం యాపర్ల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పలుస శంకర్‌గౌడ్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. మూడు దశాబ్దాలకుపైగా విద్యాశాఖకు ఆయన అందించిన సేవలకు గాను ఈ పురస్కారం లభించింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు. శంకర్‌గౌడ్ పనిచేసిన ప్రతి పాఠశాలలో అక్షరదీక్ష , విలువల విద్య, బాల సాహిత్య సభలతోపాటు సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా వివిధ అంశాలకు సంబంధించిన దాదాపు 30వేలకు పైగా పుస్తకాలను సేకరించి శాఖ గ్రంథాలయాలకు అందజేశారు.

- చిన్నచింతకుంటలో వారం రోజులుగా తాగునీటికి కటకట
- మల్దకల్ మండలం పెద్దతండాలోనూ ఇదే దుస్థితి
- సమస్య చెబుదామంటే జీపీ కార్యాలయానికి తాళం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, పట్టించుకోని అధికారులు

# బిందెల యుద్ధం



చిన్నచింతకుంటలో తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద బిందెలతో బారులుదీరిన మహిళలు



మల్దకల్ : పెద్దతండాలో చేతిపంపు వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), సెప్టెంబర్ 4 : చిన్నచింతకుంట మండలకేంద్రంలో వారం రోజులుగా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చిన్నచింతకుంట గ్రామ శివారులోని వాగు నుంచి బోరుద్వారా మోటర్ల సాయంతో తాగునీటిని సరఫరా చేసేవారు. అయితే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోరుబావులు పూడుకుపోవడంతోపాటు మోటర్లు నీటిలో కొట్టుకుపోయి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామం మొత్తంలో 14 వార్డులు ఉండగా పంచాయతీ అధికారులు కేవలం నాలుగైదు ట్యాంకర్ల నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతోపాటు తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

***బోరింగుల వద్దకు పరుగులు..***

మల్దకల్, సెప్టెంబర్ 4 : మండలంలోని పెద్దతండా గ్రామ పంచాయతీలో తాగునీటి ఎద్దడి నెలకొన్నది. తమ సమస్యను చెప్పుకొందామంటే కనీసం పంచాయతీ కార్యదర్శి కొన్ని రోజులుగా గ్రామానికి రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఓ వైపు భారీ వర్షాలు కురుస్తుండగా మరోవైపు తాగునీరు లేక అష్టకష్టాలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా గ్రామంలోని వాటర్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా చేయకపోవడంతో చేతిపంపులు, వ్యవసాయబోర్లను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ సమస్యను కనీసం కార్యదర్శికి అయినా చెప్పుకుందామంటే కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీకి రాకపోవడంతో కార్యాలయం కూడా తెరిచేనాథుడు లేడని వాపోతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ విషయంపై ఎంపీడీవో ఆంజనేయరెడ్డిని వివరణ కోరగా నెలరోజుల్లో మూడు సార్లు గ్రామాన్ని తనిఖీ చేశామని కార్యదర్శి అక్కడే ఉన్నాడని చెప్పారు. అయితే తాగునీటి సమస్య ఉందని ఈ రోజే తెలిసిందని, వెంటనే కార్యదర్శిని గ్రామానికి వెళ్లాలని ఆదేశించామని, రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఏవోకు వీరభద్రప్పకు వినతి పత్రం అందజేస్తున్న గురుకుల పార్ట్‌టైమ్ ఉద్యోగులు →



## పార్ట్‌టైమ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

గద్వాల, సెప్టెంబర్ 4 : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పీఈటీలను ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పార్ట్‌టైమర్లను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేండ్లుగా గురుకులాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో తమను విధుల్లోకి తీసుకున్నారని, తరగతుల నిర్వహణ, సూపర్ విజన్స్, సెల్ఫ్‌స్టడీస్, హాలిడే సమయాల్లో విధులు నిర్వర్తించామన్నారు. కానీ ప్రభుత్వం అకస్మాత్తుగా విధుల నుంచి తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గత విద్యాసంవత్సరంలో కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రతిరోజూ నలుగురు ఉపాధ్యాయులు రాత్రివేళల్లో విధులు నిర్వర్తించి విద్యార్థుల భద్రత, ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు మూడు నెలల జీతాలు ఇవ్వలేదని, కుటుంబ పోషణ భారమైనా పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం ఏవో వీరభద్రప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పార్ట్‌టైం ఉద్యోగులు వెంకటేశ్, గూడ్‌సాబ్, నాగరాజు, మద్దేశ్వరి, ప్రియాంక, ఉమామహేశ్వరి, భారతి, బాబు, వెంకటేశ్వర్లు, నరేశ్, బలరాముడు, మునిస్వామి, రాజు, వెంకటేశ్వర్లు, వాణి, రేవతి, హుస్సేన్, దేవన్న పాల్గొన్నారు.

## ఉధృతంగా పెద్దవాగు ప్రవాహం

- నిలిచిన అంబులెన్స్‌లోనే ప్రసవం

మానవపాడు, సెప్టెంబర్ 4 : సమయానికి పీహెచ్‌సీకి చేరుకోలేకపోవడంతో ఓ గర్భిణి 108లోనే ప్రసవించగా తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన రేవతికి మంగళవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది రేవతిని మానవపాడు పీహెచ్‌సీకి తరలిస్తుండగా అమరవాయి సమీపంలోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాన్ని అక్కడే నిలిపివేశారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడం, వెనుదిరిగి వెళ్లలేని పరిస్థితి ఉండడంతో 108 సిబ్బంది శేఖర్, డ్రైవర్ శ్రీశైలం పురుడుపోశారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉండడంతో వారిని వడ్డేపల్లి పీహెచ్‌సీలో చేర్పించారు. సిబ్బందిని రేవతి కుటుంబసభ్యులు, వైద్యులు అభినందించారు.







